

వసతిగృహాన్ని తనిఖీ చేసిన అధికారులు

ప్రజాశక్తి-పెదబయలు : స్థానిక బాలుర రెసిడెన్షియల్ పాఠశాల వసతి గృహాన్ని బుధవారం తహశీల్దార్ రంగారావు, గిరిజన సంక్షేమ సహాయకురాలు కంకిపాటి స్వర్ణలత, విద్యాశాఖాధికారి సందర్శించారు.ముందుగా విద్యార్దులు ఆరోగ్యంపై అరా తీశారు. మెనూ భోజనం పరిశీలించారు. వేడి నీళ్లు తాగటానికి ఇవ్వలేదని విద్యార్దులు తెలిపినట్లు తహశీల్దార్, విద్యాశాఖాధికారి డేవిడ్ పుష్ప విలేకరులకు తెలిపారు.



తనిఖీ చేస్తున్న అధికారులు

విద్యార్థుల మృతిపై జ్యూడీషియల్ విచారణ చేపట్టాలి

-బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించాలి-ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రతినిధి బృందం



బాధిత విద్యార్థిని పరామర్శిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రతినిధి బృందం నేతలు

ప్రజాశక్తి-పాడేరు: అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని అనాథాశ్రమంలో ఆదివాసీ విద్యార్థుల మృతిపై జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌తో విచారణ చేపట్టాలని, ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందని ఆదివాసీ గిరిజన సంఘం నేతలు తెలిపారు. విషాహారం తిని అస్వస్థతతో బాధపడుతున్న ఆదివాసీ విద్యార్థులను రాష్ట్రీయ ఆదివాసీ అదికార్ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పల నరస, ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.చిన్నం నాయుడు, ఆంధ్ర యూనివర్సిటీ గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు సింహాద్రి, సత్యనారాయణ, జిల్లా నాయకులు కోటి బాబుతో కూడిన రాష్ట్ర ప్రతినిధి బృందం బుధవారం విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆదివాసీ విద్యార్థులను పరామర్శించారు. అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అస్వస్థతకు గల కారణాలను, విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత 13 సంవత్సరాలు గా ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతి లేకుండా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో అనాథ ఆశ్రమం నిర్వహిస్తుంటే అధికారుల పర్యవేక్షణ లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థుల సంఖ్య తక్కువని రేషనలైజేషన్ పేరిట మూసివేసిన పాఠశాలల గ్రామాల్ని గుర్తించి ఆశ్రమంలో నాణ్యమైన విద్య అందిస్తామనే పేరుతో కొంత మంది మధ్యవర్తులు ఆదివాసీలను ప్రలోభాలకు గురి చేసి తీసుకెళ్లున్నారు. ఇదీ ప్రభుత్వ హత్యగానే గుర్తించి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను ఇంటికి పంపించడంతో వైద్యం సకాలంలో అందలేదన్నారు.కజీహెచ్ ఎమర్జెన్సీ వార్డుల్లో ఉన్న 8 మంది పరిస్థితి నిలకడగా ఉందని, మిగిలిన ఆసుపత్రి లో వైద్యం పొందుతున్న చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ఆందోళన గురైతున్న విషయాన్ని పలువురు బృందం నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. మరణించిన కుటుంబాలకి 25లక్షల చొప్పున నష్టపరిహారాన్ని, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర డిమాండ్ చేశారు. ఈ సంఘటన జరిగి మూడు రోజులు అవుతున్నా సమాచారం బయటకు రానివ్వకుండా యాజమాన్యం చేసిందన్నారు.ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతి లేకుండా నడుస్తున్న అనాథ ఆశ్రమాలను మూసివేయాలన్నారు. పిల్లలకు పి.వి.టి.జి గురుకులం లో ప్రత్యేక అడ్మిషన్ ఇవ్వాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలోని అనేకమంది విద్యార్థులు చదువు నిమిత్తం నర్సీపట్నం, ఎస్.కోట, చోడవరం, మాడుగుల తదితర ప్రాంతాలకు వెళుతున్నారని, కనీస సౌకర్యాలు లేక అద్దె భవనాల్లో అరకొర వసతులతో చదువుతున్నారన్నారు.

.విద్యార్థుల ఆరోగ్యంపై ఎస్ఎఫ్ఐ ఆరా

పాడేరు: కలుషిత ఆహారంతో అస్వస్థత పొంది పాడేరు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆదివాసీ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్ శ్రీను, జీవన్ కృష్ణ, ఉపాధ్యక్షులు చిన్నారావు ఆరా తీశారు. బుధవారం వారు ఆసుపత్రిని సందర్శించారు. చికిత్స పొందుతున్న 8 మంది విద్యార్థులను పరామర్శించారు. ఈ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యాధికారులను ఆరా తీశారు. మెరుగైన వైద్య సేవలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

కుటుంబ సభ్యులకు పరామర్శ

చింతపల్లి: మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు 25 లక్షల పరిహారం, ఐటిడిఎలో ఉద్యోగం ఇవ్వాలని ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి జిల్లా గౌరవాధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. చింతపల్లి మండలం టుముల పంచాయతీ నిమ్మలపాలెం గ్రామంలో పాంగి జాషువా కుటుంబాన్ని పరామర్శించారు. తల్లి తాంబేలి మార్తతో మాట్లాడారు. వివిధ ఆసుపత్రులలో ఉన్న ఆదివాసి గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఈ దుర్ఘటనపై నిర్వాహకుడు తో పాటు విద్యాశాఖ అధికారులపైనా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాంగి రమేష్, రాధికా, కృపావతి తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న చిన్నయ్యపడాల్

పాఠశాల భవనం నిర్మించరూ..

ప్రజాశక్తి -ముంచింగి పుట్టు : మండల పరిధిలోని సుజన కోట పంచాయతీ బీటా గ్రామంలో పాఠశాల భవనాలు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు సీసా లైకోన్, సీస రామకృష్ణ, తిరుపతి, బలరాం లు కోరారు. ఈ విషయంపై సీసా లైకోన్ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, పాఠశాల భవనాల నిర్మాణాలకు సుమారు 22 లక్షలు నిధులు మంజూరు కాగా అప్పటి ఉపాధ్యాయులు , కాంట్రాక్టు కుమ్మక్కై ఆరు లక్షలు బ్యాంకు నుండి డబ్బులు తీసినట్లు తెలిపారు. పాఠశాల భవనం లేక గిరిజన విద్యార్థులు విద్యాభ్యాసానికి అనేక అవస్థలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. తాత్కాలికపు రేకుల షెడ్డు నిర్మించేందుకు కనీసం చొరవ తీసుకోలేదని విమర్శించారు.అర్ధాంతంగా నిలిచిపోయిన ప్రాంగణంలో తాత్కాలికంగా పాఠశాల నిర్వహణ ప్రస్తుతం ఉందన్నారు. ఈ పాఠశాల భవన నిర్మాణాలకు మంజూరైన నిధులు ఏమయ్యాయో ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి పాఠశాల భవనాల నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న గ్రామస్తులు



చేతులు జోడించి వేడుకుంటున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

పెట్రాయి పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలి

- చేతులు జోడించి వేడుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం దారకొండ పంచాయతీ పెట్రాయి ఎంపిపి పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించండి మహా ప్రభువు అంటూ చేతులు జోడించి గ్రామస్తులు, విద్యార్థులు బుధవారం వేడుకున్నారు. పెట్రాయి జిటిఎస్‌డబ్ల్యూ పాఠశాలలో 36 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, జూలై నుంచి ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు చదువు చెప్పలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం గ్రామస్తులు పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయడిని నియమించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు వంతుల చిట్టిబాబు మాట్లాడితూ ఆగస్టు 15న పాఠశాలలో జాతీయ పతాకం ఆవిష్కరించి నాధుడే కరువయ్యారని పేర్కొన్నారు. తమ పిల్లలకు చదువు చెప్పడానికి కనీసం ఉపాధ్యాయుని నియమించడానికి ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఐటిడిఎ పిఒ, జికె.వీధి ఎంఇఒ స్పందించి తమ పిల్లలకు చదువు చెప్పేందుకు ఉపాధ్యాయుని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కూడా గోపాల్ రావు, కొండ్రా బుట్టి, కిముడు రాంబాబు, కొర్ర బలరాం, వంతల చిట్టి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో మండల అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రాజవొమ్మంగి గురుకుల బాలికల పాఠశాల, కళాశాల, గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలను ఎంపీడీవో లోకుల యాదగిరి శ్వరరావు, సిఐ సన్యాసినాయుడు, డిప్యూటీ తాహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఐసిడిఎస్ సిడిపిఒ దేవమణి తదితరులు సందర్శించారు. వసతిగృహాల్లో సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ అమలుపై ఆరా తీశారు. విద్యార్థులకు మెనూ సక్రమంగా అందించాలని, వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని, పరిసరాలు పరిసరపంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, వసతి గృహాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ గ్రామసభలు విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మండలంలోని గ్రామాల్లో నిర్వహించే ఉపాధి హామీ పథకం గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపిడిఒ ఆర్.ఫణీంద్రరెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 23న మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల్లో ఈ గ్రామసభలు నిర్వహించాలని ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ పనుల జాబితాను 46గా గుర్తించి వాటిని గ్రామసభలో తీర్మానం చేయించి పనుల జాబితాను తీసుకోవాలని కోరారు. ఈ సభలకు పంచాయితీ సెక్రటరీ కన్వీనర్‌గా, ఎంజిఎన్ఆర్ఈజీఎస్, పిఆర్ ఎఇ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ, పశుసంవర్ధక శాఖ, వ్యవసాయ శాఖ, పట్టు పరిశ్రమ శాఖ, ఉద్యానవన శాఖ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలంలోని వివిధ పంచాయతీల్లో ఈ నెల 23వ తేదీన నిర్వహించే గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మళ్ళా దుర్గా ప్రసాద్, మండల యూత్ అధ్యక్షుడు భీశెట్టి సత్య కుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామాల్లో ఉన్న సీసీ రోడ్లు, వీధి దీపాలు, గ్రావెల్ రోడ్లు, మంచి నీటి సమస్యలు ఇతర సమస్య తెలియజేయటానికి గ్రామసభలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనవలసినదిగా కోరారు.



మోకాళ్లపై నిలబడి నిరసన చేపడుతున్న విద్యార్థులు

ఉపాధ్యాయుడిని నియమించాలని

మోకాళ్లపై విద్యార్థుల వినూత్న నిరసన

ప్రజాశక్తి -అనంతగిరి: నిమ్మలపాడు పాఠశాలకు తక్షణమే పూర్తిస్థాయి ఉపాధ్యాయుడుని నియమించాలని కోరుతూ విద్యార్థులు మోకాళ్ళతో వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. గత మూడు నెలలుగా ఉపాధ్యాయుడు లేక సరైన చదువు అందడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.ఈ పాఠశాలలో నిమ్మలపాడు, కరకవలస, రాళ్లగెడ్డ, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 70 మంది విద్యార్థులు పైగా చదువుతున్నారన్నారు. ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థులకు కనీస అక్షరాజ్ఞానం లేదన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి పూర్తిస్థాయి ఉపాధ్యాయుడుని ఏర్పాటు చేయాలని కోరారు.ఉపాధ్యాయుడు లేక విద్యార్థులకు అక్షరాలు రాని పరిస్థితి నెలకొందని సిపిఎం మండల కమిటీ సభ్యుడు మోహన్ అన్నారు. పాఠశాలకు బాషా వాలంటరీ తప్ప పూర్తిస్థాయి ఉపాధ్యాయుడు లేరని తెలిపారు.



పరిశీలిస్తున్న గంగరాజు, తదితరులు

పాఠశాల పనులను పరిశీలించిన జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి అనంతగిరి: ఏకలవ్య పాఠశాల నిర్మాణ పనులను జెడ్పీటిసి సీపీఎం బందం నేతలు బుధవారం సందర్శించారు. అనంతగిరి పంచాయతీ పాతకోటలో 40 కోట్లతో జరుగుతున్న పనుల పురోగతిని ఇంజనీరింగ్ అధికారి వెలిసెట్టి తేజను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నేతలకు జరుగుతున్న నిర్మాణా పనులను వివరించారు అనంతరం గంగరాజు మాట్లాడుతూ, భూములు ఇచ్చిన రైతులకు నాన్ టీచింగ్ పోస్టుల భర్తీలో ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ విషయం పై కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. నిలిచిన అనంతగిరి- మలింగవలస, పాత్తకోట, రేగం రోడ్డు, మలింగవలస బిడ్జి పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం టోకురు సర్పంచ్ కిల్లో మోస్య, అనంతగిరి సిపిఎం మండల కార్యదర్శి సోమెల నాగులు, అనంతగిరి వైస్- సర్పంచ్ పాంగి అర్జున్, దీసరి లక్ష్మణరావు, కాంగ్రెస్ నాయకుడు పాంగి శాంతిరావు, స్థానికులు చిట్టం సింహాద్రి, నందుల, సొన్య చిట్టం.రమేష్ పాల్గొన్నారు..

కోల్‌కతా హత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలి

సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీలు, మానవహారాలు



రంపచోడవరంలో మానవహారం చేస్తున్న సిఐటియు నేతలు, స్కీమ్ వర్కర్లు

ప్రజాశక్తి- రంపచోడవరం

కోల్‌కతా ఆర్‌జి కార్ ఆసుపత్రిలో వైద్య విద్యార్థిని డాక్టర్ మౌమితపై అత్యాచారం చేసి, హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన స్థానిక సీఐటీయూ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్, జిల్లా ఉపాధ్యక్షులు పుట్ట రామరాజు, కె.శాంతిరాజు, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిన నిర్మల మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ళు గడుస్తున్నా ఇప్పటికి మహిళలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. కోల్‌కతా ఆర్‌జి కార్ ఆసుపత్రిలో వైద్య సేవలు అందించి విశ్రాంతి తీసుకుంటున్న డాక్టరు మౌమితపై కొందరు దుండగులు అమానుషంగా, అతి కిరాతకంగా మానభంగంచేసి దారుణంగా హత్య చేసిన మానవ మృగాలను ఎట్టి పరిస్థితుల్లో క్షమించరాదని పేర్కొన్నారు. ఈ సంఘటనలో రాష్ట్ర ప్రభుత్వం తన తప్పును కప్పిపుచ్చుకొనే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. పోలీసులు నిష్పాక్షికంగా విచారణ చేపట్టాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా నేరస్థులను విచారించి వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు కొమరం చెల్లాయమ్మ, కళింకోట రమణమ్మ, ఆశ యునియన్ నాయకులు సారపు మంగాయమ్మ, వీరవతుల మర్థమ్మ, మధ్యాహ్నం భోజనం యూనియన్ నాయకులు కూర కుమారి, కె.వీరమణి, వెలుగు వివోఎల యూనియన్ జిల్లా కార్యదర్శి అరగటి రామకృష్ణ, జిల్లా నాయకులు నరసింహ తదితరులు పాల్గొన్నారు

చింతూరు : కోల్‌కత్తా హత్యాచారాన్ని నిరసిస్తూ బుధవారం చింతూరు ఐటిడిఎ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. అనంతరం సిఐటియు నాయకులు, వైద్యులు, వైద్య సిబ్బంది, పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు చింతూరు ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. దోషులను కఠినంగా శిక్షించాలని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సీసం సురేష్, యర్రంశెట్టి శ్రీనివాస్, యర్రం కాశి, మల్లిపూడి సతీష్, వెంకన్న, విరబోయిన రాజ్‌కుమార్, గణేష్, ప్రవీణ్ కుమార్ (కప్పు), పొషేశ్వరవు(పోషి), నరెడ్ల అయ్యప్ప, సబీర్, సమీర్, హర్ష, పురాలశెట్టి దుర్గ ప్రసాద్, కట్టసాయి, కుకునూరి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి : కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం ఘటనపై హ్యూమన్ రైట్స్ యాంటీ క్రైమ్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ కృష్ణకుమారి ఆధ్వర్యాన మండల కేంద్రంలోని బుధవారం విద్యార్థినీలతో కలిసి భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ స్టేట్ ప్రెసిడెంట్ శుభకాంగ్ మాట్లాడుతూ, మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేసారు. ఈ ఘటనకు పాల్పడిన నిందితులను వెంటనే శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బూర్జా లక్ష్మి, డుంబ్రిగుడ వైద్యాధికారి పాంగి రాంబాబు, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



చింతూరులో సిఐటియు నేతలు, వైద్యులు, సిబ్బంది, విద్యార్థుల మానవహారం



అనంతగిరిలో నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన ప్రదర్శన

ముంపునకు గురైన ప్రతి ఇంటికీ నష్టపరిహారం చెల్లించాలి

వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య

ప్రజాశక్తి-కూనవరం : ఇటీవల సంభవించి వరదల సమయంలో ముంపునకు గురైన ప్రతి ఇంటికీ నష్టపరిహారం వెంటనే చెల్లించాలని వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో తలగాని నాగరాజు అధ్యక్షతన జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో పెంటయ్య మాట్లాడారు. ముంపు గ్రామాల్లో ఇప్పటికీ బరకాలు ఇవ్వలేదని, నష్టపరిహారం అందించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి ముంపునకు గురైన ప్రతి ఇంటినీ సర్వే చేసి తక్షణమే వారికి గత ప్రభుత్వం ఇచ్చినట్టుగా రూ.95వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల నాయకులు నానుపల్లి వెంకటేశ్వరరావు, పాయం సత్యనారాయణ, కర్నాటి శ్రీనివాస్‌రావు, బాబు బొర్రయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు, తెల్లం తమ్మయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ ఎంపిపి పెంటయ్య

వేతన బకాయిలు చెల్లించాలని పారిశుధ్య కార్మికుల ధర్నా



ఐటిడిఎ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు డివిజన్ నాలుగు మండలాల పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ సిఐటియూ ఆధ్వర్యంలో చింతూరు ఐటిడిఎ కార్యాలయం ముందు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి పొడియం లక్ష్మణ్ మాట్లాడుతూ పాఠశాలల్లో అధిక పని చేస్తున్న శానిటేషన్ వర్కర్లకు జీతం మాత్రం అతి తక్కువ ఇస్తున్నారని, ఆ మొత్తం కూడా సకాలంలో చెల్లించకపోతే కార్మికుల కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. టిడిపి కూటమి ప్రభుత్వమైనా శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పని భారం తగ్గించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. గ్లౌజులు, మాస్కులు, షూలు లేకుండా పనిచేస్తున్నారని, వారికి వాటిని అందించాలని కోరారు. అనంతరం ఐటిడిఎ పిఒ వచ్చి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని పిఒకు అందించారు. దీనికి స్పందించిన పిఓ మాట్లాడుతూ తన పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని, మిగిలిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్లు సురేష్, జయ, రజని, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

మిడ్డేమీల్స్ కార్మికులను తొలగించొద్దు


ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు


ప్రజాశక్తి-కూనవరం : పాఠశాల అభివృద్ధి కమిటీల ఎన్నికల అనంతరం మండలంలోని మిడ్డే మీల్స్ కార్మికులను తొలగించే ఆలోచన టిడిపి నాయకులు చేస్తున్నారని, అటువంటి ప్రయత్నాలు సరికాదని వైస్ ఎంపిపి, సిపిఎం నాయకులు కొమరం పెంటయ్య అన్నారు. ఈ మేరకు సిపిఎం నాయకులు బుధవారం స్థానిక ఎంఇఒ లక్ష్మయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ ఎటువంటి తప్పులు లేకపోయిన ప్రస్తుతం పని చేస్తున్న మిడ్డే మీల్స్ కార్మికులను తొలగించాలనుకోవడం దారుణమన్నారు. ఎటువంటి తొలగింపులు చేపట్టినా సీఐటీయూ ఆధ్వర్యాన పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మేకల నాగేశ్వరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, ఈశ్వర్లు జ్యోతి, భద్రమ్మ పాల్గొన్నారు.

ఎటపాక సిఐని కలిసిన సిపిఎం నాయకులు


ఎటపాక సిఐని పుష్పగుచ్ఛం ఇస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- వి.ఆర్.పురం : ఎటపాక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కన్నపరాజును సిపిఎం వి.ఆర్ పురం మండల కమిటీ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిస్థితులను సిఐ అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణ అందరూ సమన్వయంతో సహకరించేలా చూడాలని నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చినబాబు, మండల నాయకులు పంకు సత్తిబాబు, గుండేపూడి లక్ష్మణరావు, వీరపు తాతబాబురెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు


ఆక్రమిత భూమిని పరిశీలిస్తున్న డిటి సత్యనారాయణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక డిప్యూటీ తహశీల్దార్ అల్లు సత్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని దూసరపాము గ్రామ శివారు కిండ్ర జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న చెరువుగట్టు వద్ద గుర్తు తెలియని వ్యక్తులు చదును చేసి సిమెంట్ స్తంభాలు వేసిన నేపథ్యంలో, విషయం తెలుసుకున్న స్థానిక డిప్యూటీ తహశీల్దార్ బుధవారం తన సిబ్బందితో అక్కడికి చేరుకొని స్తంభాలను తొలగించారు. ఎటువంటి ఆక్రమణలకు పాల్పడిన అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాఠశాల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని ముసురుమిల్లి ఏపీటీడబ్ల్యు ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఐటిడిఎ పిఒకు వినతిపత్రం సమర్పించినట్లు ఆ పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ చిచ్చల రాజశేఖర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఆర్వో ప్లాంట్ సక్రమంగా పనిచేయడం లేదని, పాఠశాలలో కరెంట్ సప్లై లేక చేయటం అస్తవ్యస్తంగా ఉందని, వాటిని మరమ్మతులు చేయాలని కోరారు. ఈ పాఠశాలలో సుమారు 640 మంది గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, వారికి సరైన సౌకర్యాలు కల్పించాలని లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

5న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి -సీలేరు : రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 5న అన్ని సిఎండి ఆఫీసుల వద్ద, ఏపీ జెన్కో కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నట్లు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి. విష్ణుకుమార్ తెలిపారు. ఆయన స్థానిక విలేకరులతో బుధవారం మాట్లాడుతూ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు అల్లూరి జిల్లా నుంచి కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లావ్యాప్తంగా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏపీ ట్రాన్స్కో (ఈపీడీసీఎల్) సిఎండి ఆఫీసుల ముందు ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఆయా సంస్థల అధికారులకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

కలుషిత ఆహార మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ప్రజాశక్తి -సీలేరు : అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో ఒక కార్యక్రమంలో మిగిలిపోయిన ఆహార పదార్థాలను పెట్టి ఆదివాసి చిన్నారులు మృతి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు కొర్ర బాలయ్య డిమాండ్ చేశారు. మృతుల కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అస్వస్థత గురైన ఆదివాసి విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

ఘోర ప్రమాదం!



- ఎసెన్సియా ఫార్మాలో పేలిన రియాక్టర్
- 18 మంది కార్మికుల దుర్మరణం
- చెల్లాచెదురుగా పలువురి శరీర భాగాలు
- మిన్నంటిన మృతుల కుటుంబీకుల రోదనలు
- రూ.కోటి పరిహారం అందించాలి : సిపిఎం

ప్రజాశక్తి- అచ్యుతాపురం, అనకాపల్లి విలేకర్లు

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధి సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మాలో రియాక్టర్ పేలి 18 మంది మృతిచెందారు. సుమారు 50 మందికి పైగా వరకు తీవ్ర గాయాలపాలయ్యారు. ఫార్మా రెండో అంతస్తులోని ప్రొడక్షన్ హాల్లో రియాక్టరు పేలడంతో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ పేలుడు ధాటికి పలువురి శరీర భాగాలు చెల్లాచెదురుగా ఎగిరి పడ్డాయి. గాయాలపాలైన కార్మికులను అచ్యుతాపురం, అనకాపల్లి ఆసుపత్రులకు తరలించారు. సంఘటనా స్థలానికి కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ ఎం.దీపిక చేరుకున్నారు. ప్రమాద కారణాలను కంపెనీ యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. కంపెనీ వద్ద మంటలు ఆర్పే క్రమంలో సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షించారు. సమీప ఫార్మా కంపెనీల అగ్నిమాపక సిబ్బందిని, ఎలమంచిలి, అచ్యుతాపురం, అనకాపల్లి, ఎన్‌టిపిసికి చెందిన అగ్నిమాపక దళాలను రప్పించి మంటలు ఆర్పే ప్రయత్నాలు చేశారు. సాయంత్రం 5 గంటల సమయానికి కంపెనీలో మంటలు అదుపులోకి వచ్చాయి. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు కలెక్టర్ ఫోన్‌లో ఆదేశించారు. కంపెనీని అచ్యుతాపురం సెజ్‌లో 40 ఎకరాల్లో 2019లో రూ. 200 కోట్లతో ప్రారంభించారు. కంపెనీలో ఇంటర్మీడియట్ కెమికల్స్ తయారు చేస్తున్నారు. కంపెనీలో మొత్తం 381 మంది ఉద్యోగులు రెండు షిఫ్టుల్లో పని చేస్తున్నట్లు తెలిసింది. మధ్యాహ్నం షిఫ్ట్ మారుతున్న సమయంలో రియాక్టర్ పేలి పొగలు వ్యాపించడంతో ఉద్యోగులు బయటకు పరుగులు తీశారు.


రోదిస్తున్న మృతుల కుటుంబీకులు

ఘటనా స్థలికి రాజకీయ, యూనియన్ల నాయకులు

ప్రమాద సంఘటనా స్థలాన్ని సిఐటియు నాయకులు ఆర్.రాము, గనిశెట్టి సత్యనారాయణ, కె.సోమనాయుడు, రామకృష్ణ తదితరులు చేరుకున్నారు. క్షతగాత్రులను పరామర్శించారు. టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని, జనసేన ఉత్తరాంధ్ర జిల్లాల రాజకీయ ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్ తదితరులు పరిశ్రమ వద్దకు చేరుకున్నారు.

ఎంపీ సిఎం.రమేష్ దిగ్భ్రాంతి

ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫార్మా ప్రమాదంపై ఆరా తీశారు.

ఫార్మా ప్రమాదంపై విచారణ జరపాలి

-రూ.కోటి పరిహారం అందించాలి : సిపిఎం

అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ ప్రైమ్ లిమిటెడ్ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలని, మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందించాలని, క్షతగాత్రులైనన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్‌చేశారు. కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

భద్రతా ప్రమాణాలు పాటించడంలో ఫార్మా కంపెనీలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే కమిటీల పేరుతో హడావిడి చేస్తున్నారు తప్ప, కంపెనీల్లో ఉన్న లోపాలపై నిరంతరం తనిఖీలు చేయడంలేదన్నారు ఘటనపై ఉన్నత స్థాయి విచారణ జరపాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. కె. ఎస్. వి.కుమార్ డిమాండ్ చేశారు. ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేశారు.


ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్న బాధితులు

అనధికారిక వసతి గృహాలు నిర్వహిస్తే చర్యలు

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్


విద్యార్థులను పరామర్శిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: అనధికారికంగా నిర్వహిస్తున్న వసతి గృహాలపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేసారు. బుధవారం సర్వజన ఆస్పత్రిని సందర్శించిన ఆయన విషాహారం తిని అస్వస్థతతో చికిత్స పొందుతున్న ఎనిమిది మంది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా వారి సంరక్షకులతో మాట్లాడిన కలెక్టర్ మండలంలో ఎన్నో వసతి గృహాలు ఉండగా అనుమతి లేని వసతి గృహంలో జాయిన్ చేయడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలందరినీ వారికి దగ్గరలో గల ఆశ్రమ పాఠశాలలలో చేర్పిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం జిజిహెచ్ లో చికిత్స తీసుకుంటున్న ఎనిమిది మంది పిల్లల్ని డిశ్చార్జ్ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో కలెక్టర్ మాట్లాడుతూ, ముగ్గురు విద్యార్థులు మృతి చెందడం భాదాకరమన్నారు. మిగిలిన పిల్లలందరినీ వివిధ ఆసుపత్రులలో జాయిన్ చేసి తగు చికిత్సలు అందిస్తున్నామన్నారు. వీరిలో ఎనిమిది మందిని వివిధ కార్పోరేట్ ఆసుపత్రులకు తరలించామని, వారిలో నలుగురి కోలుకున్నారని, మిగిలిన నలుగురికి మెరుగైన చికిత్సలు అందిస్తున్నామని వెల్లడించారు. జిల్లాలో ఇప్పటికే చింతపల్లి, రంపచోడవరం మండలాలలో రెండు అనధికార వసతి గృహాలను గుర్తించడం జరిగిందని, వాటిపై తదుపరి విచారణ నిర్వహించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సంక్షేమ శాఖలు, ఐసిడిఎస్, పోలీస్, రెవెన్యు అధికారులతో తనిఖీలు చేయించడం జరుగుతుందన్నారు. అనుమతులు లేకుండా అనధికారికంగా నిర్వహిస్తున్న వసతి గృహాల నిర్వాహకులు వారి వద్ద నున్న పిల్లలను అప్పగించాలని, లేకుంటే కటిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి . జమాల్ బాషా, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హేమలత, డిసిహెచ్ఎస్ కృష్ణారావు, ఆసుపత్రి పర్యవేక్షకురాలు విశ్వామిత్ర పాల్గొన్నారు.

కేన్సర్ బాధితులకు హోమీబాబా ఆసుపత్రిలో చికిత్స

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ వెల్లడి

ప్రజాశక్తి పాడేరు, : జిల్లాలో నిర్ధారించబడిన క్యాన్సర్ రోగులకు విశాఖపట్నం హోమీ భాభా క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్‌లో చికిత్సలు అందిస్తామని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేసారు. బుధవారం పాడేరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, మే నెల 27 వ తేదీ నుండి జిల్లా యంత్రాంగం, వై ఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ గ్రేస్ కాన్సర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న కాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలలో ఇప్పటివరకు పాడేరు డివిజన్ ఫరిధిలో 61 క్యాన్సర్ స్క్రీనింగ్ శిభిరాలు నిర్వహించామని తెలిపారు. 5,274 మంది మహిళలు, 2,324 మంది పురుషులతో కలిపి 7,598 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరిక్షలు నిర్వహించారని కలెక్టర్ వివరించారు. 1,785 మందికి మ్యామోగ్రాం పరీక్షలు, 2,310 మందికి ప్యాప్ స్మీయర్ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. క్యాన్సర్ అనుమానితులుగా గుర్తించిన 26 మందికి బయాప్సి పరీక్షలు చేయాల్సి ఉందని, అదేవిధంగా 145 కేసులను ఆల్ట్రా సౌండ్ స్కేనింగ్ కు రిఫర్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ పరీక్షలలో క్యాన్సర్ నిర్ధారణ జరిగిన వారికి వై ఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హెూమీ భాభా క్యాన్సర్ హాస్పిటల్‌లో చికిత్స అందించడం జరుగుతుందన్నారు.

ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ మాట్లాడుతూ, ఈ నెల 22వ తేదీన చింతపల్లి మండలం కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక క్యాంపు నిర్వహించి ప్రజలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. 23వ తేదీన చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వై ఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి వై యెస్ రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ, రొమ్ము, గర్భాశయ మరియు నోటి క్యాన్సర్‌లను ప్రారంభ దశలోనే గుర్తించడం, తద్వారా దాదాపు 100శాతం నయం చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హేమలత, ఆసుపత్రి పర్యవేక్షకురాలు విశ్వామిత్ర పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు


హుకుంపేటలో టీకాలు వేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలో సావ్వా, కితలంగి పంచాయతీల్లోని గ్రామాల్లో బుధవారం పశువులకు గాలి కుంటు వ్యాధులు రాకుండా వాక్సినేషన్ వేశారు. వైద్యాధికారిని రాజశ్రీ, వెటర్నరి అసిస్టెంట్ సుబ్బారావు, ఏ హెచ్ ఏ లు సంజీవరావు, త్రినాధ్,మనోజ్, మహేష్, జయరాజు, ప్రకాష్, రాజు, అనంత్, రత్నం, రమేష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: పశువులకు టీకాలను వేయించాలని పశు వైద్యాధికారి డీకే చరణ్ పేర్కొన్నారు. సంతారి గ్రామ చుట్టుపక్కల గ్రామాల్లో పశువులకు బుధవారం గాలికుంటు టీకాలు వేశామని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యశాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: గాలి కుంటి వ్యాధి సోపకుండా ముందస్తు టీకాలు వేయించుకోవాలని కాశీపట్నం పశువైద్య శాఖ అధికారి సాగరి గణేశ్వరరావు తెలిపారు. మండలంలోని జీనాబాడు పంచాయతీ గ్రామంలో బుధవారం 64 మూగజీవులకు గాలి కుంటి వ్యాధి టీకాలు వేయడం జరిగిందన్నారు.సెప్టెంబర్ 18 తేదీ వరకు వైద్య శిబిరాలు గ్రామాల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విన్నకోట గ్రామీణ పశువైద్య శాఖ జూనియర్ వెటర్నరీ అధికారిణి సుధారాణి సిబ్బంది పాల్గొన్నారు

1100 క్యూసెక్కులు నీరు విడుదల


డొంకరాయి జలాశయం ఆరో గేటు నుంచి విడుదలౌతున్న నీరు

ప్రజాశక్తి -సీలేరు: ఎపి జెన్కో సీలేరు కాంప్లెక్ పరిధి దిగువ సీలేరు డొంకరాయి జలాశయం 6వ నెంబర్ గేటు నుండి 1100 క్యూసెక్కులు నీటిని దిగు ప్రాంతానికి విడుదల చేస్తున్నామని ఏపీ జెన్కో డొంకరాయి ఈఈ విజయ్ కుమార్ వెల్లడించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు డొంకరాయి జలాశయం నీటిమట్టాలు 1036.30 అడుగులకు చేరుకుందని తెలిపారు. డొంకరాయి జలాశయానికి వలస గెడ్డ, ఇతర వాగుల నుంచి 5000 క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతుందని పేర్కొన్నారు. జలాశయంలో నీటిమట్టాలు ప్రమాద స్థాయికి చేరకుండా ముందస్తు చర్యలు చేపట్టి ఎప్పటికప్పుడు రిజర్వాయర్ స్థితిగతులపై పర్యవేక్షిస్తున్నామన్నారు. విద్యుత్తు ఉత్పత్తి నిమిత్తం పోల్లూరు జల విద్యుత్ కేంద్రానికి మరో 4,000 క్యూసెక్కులు నీటిని పవర్ కెనాల్ ద్వారా విడుదల కొనసాగుతుందని చెప్పారు. శాడిల్ డ్యామ్ నుంచి ఇన్ఫ్లోస్ ఏమీ లేదని నిలకడగానే ఉందని పేర్కొన్నారు. డొంకరాయి జల విద్యుత్ కేంద్రంలో రోజుకి 20.40 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని ఈఈ విజయ్ కుమార్ తెలిపారు.

వీరస్వామి మృతికి సిఐటియు సంతాపం


నివాళులర్పిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని తులుగొండ ఆశ్రమం పాఠశాలలో డైలీ వర్కర్‌గా పని చేస్తున్న మడకం వీరస్వామి అనారోగ్యంతో మృతి చెందారు. తులసిపాక స్వగహం వద్ద బుధవారం ఆయన పార్థివ దేహానికి సిఐటియు నాయకులు నివాళు లర్పించి, సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు మాట్లాడుతూ మడకం వీరస్వామి కుటుంబం సిపిఎం, సిఐటియుతో అత్యంత సన్నిహిత సంబంధం కలిగి ఉందని తెలిపారు. కార్మిక సమస్యలపై జరిగే పోరాటాలలో చురుకుగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. వీరస్వామి భార్య రాములమ్మ ఎంపీటీసీగా, ఆశా వర్కర్, ప్రజాప్రతినిధిగా చదలవాడ పంచాయతీకి ప్రజానీకానికి సేవా కార్యక్రమాలలో ముందున్నట్లు చెప్పారు. వీరస్వామి మృతి సిఐటియుకి, సిపిఎంకి, తులసిపాక గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు మదకం చిన్నయ్య, కలుముల మల్లేష్, కలముల లక్ష్మయ్య, తమ్మయ్య, గిరిజన సంఘం నాయకులు కుంజా శ్రీను, సిఐటియు రైల్వే వర్కర్స్ నాయకులు దుర్గారావు, కరక రాంబాబు, బ్రహ్మయ్య, చంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత


సాయం అందజేస్తున్న టిడిపి నేతలు వెంకటరమణారెడ్డి తదితరులు

ప్రజాశక్తి- అడ్డతీగల : స్థానిక మండల కేంద్రంలో ఏపీఆర్ స్కూల్ సమీపంలో కరెంట్ షార్ట్ సర్క్యూట్ వలన అగ్ని ప్రమాదానికి గురై మిరియాల నాగరాజు ఇల్లు పూర్తిగా ధ్వంసమై కట్టుబట్టలతో సర్వం కోల్పోయారు. విషయం తెలుసుకున్న మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జర్త వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారికి బట్టలు, 100కేజీల బియ్యం, కూరగాయలు, నిత్యవసర వస్తువులు, 4000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఇందులో భాగంగా మండల హౌసింగ్ జేఈ రమ్మని, బాధితులకు తక్షణమే ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి అన్నం సత్యనారాయణ రెడ్డి, టిడిపి నాయకులు వడ్డి రాంబాబు, వంక సతీష్ , జుజ్జవారపు శ్రీనివాస్ చౌదరి, చదువు రామకృష్ణ, ఎర్రంశెట్టి రత్నకుమారి, తోకల సత్తిబాబు, అట్ట శ్రీను, టేకుమూరు చిన్న నాగేశ్వరరావు, సత్తిరెడ్డి, కాదా ఏసుపాదం, సియాధులు సత్యనారాయణ, పల్లాల రాజారెడ్డి, బచ్చుల రాధాకృష్ణ ఇతర నాయకులు పాల్గొన్నారు.


బంద్ ప్రశాంతం



బంద్ చేస్తున్న మాలమహానాడు సభ్యులు.

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ఎస్సీ వర్గీకరణపై భారత్ బంద్ పిలుపులో భాగంగా అరకులోయలో బుధవారం మాలమహానాడు ప్రతినిధులు ఆధ్వర్యంలో బంద్ చేపట్టారు. దీంతో దుకాణాలు మూతపడ్డాయి. మాలమహానాడు కమిటీ అరకులోయ ప్రతినిధి జేకే రత్నరాజు మాట్లాడుతూ, ఎస్సీల మధ్య చిచ్చుపెట్టేలా ఏబీసీడీ వర్గీకరణ చేసి విభజించు పాలించు అనే విధంగా చేయడం సరికాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో లెనిన్ రాజు, పైడి రాజు, మంద చంద్రశేఖర్ ప్రసాద్, తిరుగుళ్ల చంద్రరావు, డిడ్ల రాజేంద్ర ప్రసాద్, మద్దిరాల కిరణ్ కుమార్, కొల్లాబత్తుల రవికుమార్ పాల్గొన్నారు.

సిఐ హిమగిరి బాధ్యతల స్వీకరణ


సిఐ హిమగిరి

ప్రజాశక్తి- అరకులోయ : అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్(సిఐ)గా ఎల్. హిమగిరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న హిమగిరిను బదిలీపై అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ గా నియమించారు. ఇప్పటి వరకు అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన సిహెచ్ రుద్రశేఖర్‌ను విశాఖపట్నం హెడ్ ఆఫీస్‌కు బదిలీ చేశారు.